క్లుప్తంగా

15న రక్తదాన శిబిరం

సీతంపేట: ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం వద్ద ఈ నెల 15న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. పాలకొండ ఏరియా ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి రక్తదాతలు విచ్చేసి, రక్తదానం చేయాలని కోరారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రమేష్

కొమరాడ: వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని, ప్రజలందరినీ వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై చైతన్యం చేయాలని ఎంపీడీవో ఎస్.రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై శనివారం అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఇంటి వద్ద ఉండి స్మార్ట్‌ఫోన్ ద్వారా ప్రభుత్వం నుంచి 709 రకాల సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిధులొచ్చాయి.. జీతాలు చెల్లించండి సార్..



చింతలబెలగాంలో విధుల నిర్వహణలో బెలగాం మహేష్

జియ్యమ్మవలస రూరల్: నిధులు వచ్చాయి.. జీతాలు చెల్లించాలని గ్రీన్‌అంబాసిడర్లంతా అధికారులను కోరుతున్నారు. గత రెండేళ్లుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చింతలబెలగాం, దత్తివలస, సింగనాపురం గ్రామాల గ్రీన్‌అంబాసిడర్లు బెలగాం మహేష్, దొనక సింహాచలం, డి.సింహాచలంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 16వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు వచ్చాయని, ఇప్పటికైనా జీతాలు చెల్లించవచ్చు కదా అని దీనంగా అడుగుతున్నారు.

పొలంగట్లు శుభ్రంగా ఉంచుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: వరి పంట సాగు చేస్తున్న రైతులంతా తమ పొలంగట్లు శుభ్రం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.శంకరరావు సూచించారు. ఇదే విషయమై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పొలాల్లో వర్షపునీటి నిల్వల కారణంగా వరిలో పాముపొడ, ఆకుముడత తెగుళ్ల వచ్చే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో పొలాలు శుభ్రంగా ఉంచుకుంటే 50 శాతం మేర తెగుళ్ల వ్యాప్తిని నివారించవచ్చని, ఆపై అవసరమైన ఎరువులు వేసుకోవాలని తెలిపారు.

ఆటోడ్రైవర్లే గుంతలు పూడ్చారు..



గుంతల్లో మట్టి నింపుతున్న ఆటోడ్రైవర్లు

భామిని: మండల కేంద్రంలోని ఏబీ రోడ్డులోని గుంతలను ఆటోడ్రైవర్లు, కలాసీలు సమష్టిగా పూడ్చివేశారు. మరమ్మతులకు గురైన రోడ్డు మీదుగా వెళ్తుంటే తమ వాహనాలు పాడవ్వడమే కాకుండా వాహనాల్లోని ప్రయాణికులు కూడా కుదుపులకు గురై ఇబ్బంది పడడంతో వారంతా రాళ్లు, ఇసుక, మట్టి, బెడ్డుతో గుంతలు కప్పి సమతలం చేశారు. ఈ మంచి పని చేసిన వారిని పలువురు అభినందిస్తున్నారు.

పాలకొండలో తాగునీటి కష్టాలు



తాగునీటి ఇబ్బందులు తెలియజేస్తున్న పట్టణ ప్రజలు

పాలకొండ: నగరపంచాయతీ ప్రజలను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. రెండు రోజులుగా 12 వార్డుల పరిధిలోని ప్రజలకు తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో వారంతా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి తాగునీటి ఇబ్బందులు లేకున్నా ప్రత్యామ్నాయ చర్యలేవీ చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధిక వర్షాలతో..

ఆందోళన వద్దు!

- వర్షాలతో రైతుల్లో ఆందోళన
- వరదనీటి నిల్వలకు పంట పాడవుతుందని భయం
- సస్యరక్షణతో పంటను కాపాడుకోవచ్చని వ్యవసాయ నిపుణుల సూచన



పాలకొండ మండలంలోని తుమరాడ వద్ద నీటమునిగిన పంటపొలాలు

పాలకొండ రూరల్:

బంగాళాఖాతంలో తరచూ ఏర్పడుతున్న ఉపరితల ఆవర్తనాలు, అల్పపీడనాల కారణంగా అన్నిచోట్లా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంటలో అధికంగా వాననీరు నిల్వ ఉండిపోవడం వల్ల పంట పాడవుతుందేమోనని భయపడుతున్నారు. ప్రస్తుతం పడుతున్న అకాల వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వరి, ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులంతా పంట నష్టపోతామేమోనని వాపోతున్నారు. అయితే ఎంత వర్షం పడినా అప్రమత్తంగా ఉండి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే నష్టమేమీ ఉండదని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. రైతులెవరూ భయపడవద్దని ఏ సమయంలో ఏ చర్యలు చేపట్టాలోనన్న విషయాలపై అవగాహన పెంచుకోవాలని సలహా ఇస్తున్నారు.

పంట సంరక్షణకు ఇలా చేయాలి..

- శ్రీధృతి, మారుటేరు సాంబ, సాంబమసూరి, స్వర్ణ వంటి వరి రకాలు ప్రస్తుతం పొట్టదశలోనూ.. ఇంద్ర, అమర వంటి రకాలు పిలక నుంచి పొట్టదశలో ఉన్నాయి. ఆయా దశలను బట్టి పంటలో యాజమాన్య పద్ధతులు చేపట్టాలి
- పెరుగుదల దశలోని వరి పైరు వరద ముంపునకు గురైతే పొలంలోని నీటినిల్వలను వీలైనంత త్వరగా తొలగించాలి
- బూస్టర్ డోస్‌గా ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌లను వేయాలి..లేదంటే లీటరుకు 5 గ్రాముల చొప్పున ఎకరాకు 200 లీటర్ల నీటిలో వాటిని కలిపి పిచికారీ చేయాలి
- ప్రస్తుత వర్షాలకు వరిలో పాముపొడ తెగులు రావడానికి అవకాశం ఉంటుంది..నివారణకు ప్రోపికోనజోల్ 1 మిల్లీలీటరు లేదా హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు నీటికి కలిపి వరి దుబ్బుకు తగిలేలా 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేయాలి
- వరిలో వచ్చే అగ్గితెగులు నివారణకు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా కాసుగామైసిన్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి
- అగ్గి, పాముపొడ తెగుళ్లు కలిసి పంటను ఆశించినపుడు ట్రైఫాక్సిస్ట్రోబిన్‌తో పాటు టెబ్యుకోనజోల్(నేటివో) 0.4 గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి

సలహాలు, సూచనలు ఇస్తున్నాం..



వర్షాల వేళ..రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. పంటనష్టం జరగకుండా సలహాలు, సూచనలు ఇస్తున్నాం. వర్షపునీటిలో పంట ఉండిపోయిందని బాధపడొద్దు. ముందుగా పంట నుంచి వాననీటిని బయటకు పంపేయండి. ఆ తర్వాత వ్యవసాయ సిబ్బంది సలహా మేరకు అవసరమైన ఎరువులు చల్లండి. పంట పాడవ్వదు.

–ఎస్‌వీవీఆర్ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి, పాలకొండ



రుద్రిపేట పొలాల వద్ద రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

చంద్రబాబు పాలనలో మోసం గ్యారెంటీ

- ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ’లో వైఎస్సార్ సీపీ నాయకులు



బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతంపేట: చంద్రబాబు పాలనలో ప్రజలకు మంచి ఏమో గానీ మోసం మాత్రం గ్యారెంటీ అని, ఆయన ఎప్పుడూ అబద్ధాలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తూ ఉంటారని వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీటీసీ జి.కోటేశ్వరరావు, సర్పంచ్ కె.వెంకునాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దోనుబాయి గ్రామంలో శనివారం పర్యటించిన వారు..ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను ప్రజలకు వివరించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి సర్కారు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. అధికారమే పరమావధిగా ఎన్నికలప్పుడు లేనిపోని హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నారని దుయ్యబట్టారు. వందల కొద్దీ హామీలిచ్చి మూడు, నాలుగు అరకొరగా అమలు చేసేసి అంతా అమలు చేసేశాం అన్నట్లుగా అభివృద్ధి పాలనకు ఏడాది పేరిట సంబరాలు చేసుకోవడం సమంజసం కాదన్నారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతినెలా 18 ఏళ్ల వయసు దాటిన మహిళలకు ఇస్తామన్న రూ.1500 ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. అలాగే 50 ఏళ్లకే బీసీలకు ఇస్తామన్న పింఛన్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వంటి పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని నిలదీశారు. ప్రజలంతా చూస్తున్నారని, గతంలోని వైఎస్సార్‌సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను గమనిస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మండంగి కేశవరావు, బిడ్డిక ప్రసాదరావు, ఆరిక సూరయ్య, కైలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

కురుపాం: మండలంలోని ఉదయపురం పంచాయతీ, కాకితాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆరిక రాజారావు, ఉదయపురం సర్పంచ్ ఆరిక అరుణలను మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి శనివారం పరామర్శించారు. రాజారావు తల్లి, అరుణ అత్త ఇటీవల మృతి చెందగా ఈ విషయం తెలుసుకున్న పుష్పశ్రీవాణి.. ఆయా గ్రామాలకు వెళ్లి, బాధిత కుటుంబాలను కలిసి వారి మరణాలకు గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్ని విధాలా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీ విద్యారాణి, మండల కన్వీనర్ గౌరీశంకరరావు, రాష్ట్ర మైనార్టీ విభాగం సంయుక్త కార్యదర్శి షేక్ నూరెళ్ల, జిల్లా కో–ఆప్షన్ సభ్యులు నిషార్, మాజీ ఏఎంసీ చైర్మన్ నిమ్మల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను నిర్వీర్యం చేస్తారా?

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



పాలకొండ రూరల్: పీపీపీ(పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి, వాటిని నిర్వీర్యం చేస్తారా అని ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రశ్నించారు. ఇదే విషయమై ఆమె శనివారం విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థులకు వైద్య విద్యనందించేందుకు వైఎస్సార్ సీపీ హయాంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం జరిగిందని, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటిని పూర్తి చేసి విద్యార్థులకు అందివ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల స్థాపన లక్ష్యం నెరవేరకుండా వాటిని పీపీపీ విధానంలో నడుపుదామన్న ఆలోచన విరమించుకోవాలన్నారు. పీపీపీ పద్ధతిలో నడిపేందుకు 10 కళాశాలలను ప్రైవేటుకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. ఇది నిరుపేదలకు వైద్యవిద్యను దూరం చేసే కుట్రేనన్నారు. సంపద సృష్టిస్తామన్నది ఇలానా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పీపీపీ మోడ్‌లో వైద్య కళాశాలల కొనసాగింపు నిర్ణయం మానుకోవాలని, లేకుంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. విద్యార్థులు, రైతులు, మహిళలు ఇలా అన్నివర్గాల వారికి కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, రాబోయే రోజుల్లో వారే తగిన బుద్ధి చెబుతారన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

వీరఘట్టం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ ఎస్.ప్రసాదరావు కోరారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో తహసీల్దారు ఎ.ఎస్.కామేశ్వరరావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, 1234 మెమోను రద్దు చేసి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పి.దుర్గారావు, వై.ప్రసాద్‌రావు, బి.రాము తదితరులు పాల్గొన్నారు.

శతశాతం హాజరు ఉండేలా చూడాలి



విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ఆనందరావు

వీరఘట్టం: మండలంలోని నందిమానుగూడ గిరిజన పాఠశాలను ఎంఈవో ఆర్.ఆనందరావు శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శతశాతం ఉండేలా చూడాలని ఆయన సిబ్బందికి సూచించారు. అలాగే విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య, భోజనం అందించే ఏర్పాట్లు పక్కాగా జరగాలన్నారు. అనంతరం తరగతుల వారీగా వెళ్లి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేశారు.

ఘనంగా నిమజ్జనోత్సవం



కొలువుదీర్చిన చోటే గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

పాలకొండ రూరల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గణనాథుని నిమజ్జనోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామగ్రామాన మండపాల్లో కొలువైన వినాయకుడి విగ్రహాలను ఉత్సవ నిర్వాహకులు తమ గ్రామ సమీపంలోని చెరువు, నదులకు తరలించి నిమజ్జనం చేశారు. విగ్రహ ఊరేగింపులో డీజే పాటలకు యువతీ యువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇదిలా ఉండగా, మండల కేంద్రంలోని బోనాం వీధిలోని 18 అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ఉన్నచోటనే నిమజ్జనం చేయడం విశేషం. పెద్ద ప్రతిమను ఊరేగించి నదికి తరలించడం కష్టతరం కానున్న నేపథ్యంలో తొలుత మహిళా భక్తులు బిందెలతో తీసుకువచ్చిన నీటితో స్వామికి అభిషేకం చేసి, అనంతరం ఫైర్ ఇంజిన్ సాయంతో పైపుతో వాటరింగ్ చేస్తూ మట్టి విగ్రహాన్ని కరిగించారు.

వెలుగు సిబ్బందిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పాచిపెంట: మహిళలకు బ్యాంకు లింక్ రుణాలు చెల్లించే విషయంలో రాజకీయ జోక్యం తగదని మండలంలోని మోసూరు గ్రామానికి చెందిన శ్రీ వరలక్ష్మి మహిళా గ్రూప్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం గ్రామంలో మహిళా సంఘం సభ్యులు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా సంఘాన్ని విజయవంతంగా నడుపుకుంటున్నామని బ్యాంకురుణాలు తీసుకున్నా ఎప్పటికప్పుడు తిరిగి కడుతున్నామని చెప్పారు. ఇటీవల బ్యాంకు లింకేజీ రుణాల కోసం సంఘం తీర్మానం చేసుకుని వెలుగు సిబ్బందికి సమర్పించామన్నారు. అయితే ఈ తీర్మానంపై వెలుగు సీసీ సంతకాలు చేయాల్సి ఉందని సంతకాలు చేయకుండా స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడినని చెప్పుకునే ఓవ్యక్తి అడ్డు తగులుతున్నాడని ఆరోపించారు. మహిళలకు రుణాల మంజూరు విషయంలో రాజకీయ నాయకులు అడ్డు తగలడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. మహిళలకు రుణాలు చెల్లించకుండా అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్న వెలుగు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హెచ్‌ఐవీపై అవగాహన

కురుపాం: మండల కేంద్రంలోని వైరిచర్ల డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యునో వైరస్)పై శనివారం అవగాహన కల్పించారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, వైరస్ కలిగిన వ్యక్తి పాలు, రక్తం ద్వారా వైరస్ సోకుతుందని వైడీవో నెట్‌వర్క్ ఓఆర్‌డబ్ల్యు ఎ.గీతారాణి తెలిపారు. ప్రతిఒక్కరూ వైరస్ సోకిన తర్వాత బాధపడడం కన్నా ఆ వైరస్‌ని దరిచేరనీయకుండా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. అలాగే హెచ్‌ఐవీ రోగుల పట్ల వివక్ష చూపరాదని, వారిని కూడా సాధారణ మనుషులు లాగే చూడాలన్నారు. ఎవరైనా వారి పట్ల వివక్ష చూపినట్లు తెలిస్తే 2017 చట్టం ప్రకారం కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

పీపీపీ విధానంలో వైద్య కళాశాలల ఏర్పాటు వద్దు

గుమ్మలక్ష్మీపురం: పీపీపీ(పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో వైద్య కళాశాలల ఏర్పాటు ఆలోచన విరమించుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో శనివారం కోరారు. పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలల ఏర్పాటు జరిగితే వైద్య విద్యతో పాటు వైద్యసేవలు మరింత ఖరీదు అవుతాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్మించి నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. బదిలీ అయిన డ్వామా పీడీని రిలీవ్ చేసి ఇక్కడకు బదిలీ అయిన పీడీని పంపించాలని, పార్వతీపురం ఐటీడీఏ రెగ్యులర్ డీడీని నియమించాలన్నారు.

8న ఉచిత మెగా నేత్రవైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని వండువ గ్రామ జంక్షన్ వద్ద ఉన్న షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ఈ నెల 8వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఎం.సింహాచలం ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుందని, రావాలనుకున్న వారు ఆధార్‌కార్డు పట్టుకుని రావాలన్నారు.

యూరియా అందివ్వకపోతే ఆందోళన తప్పదు

పాలకొండ: రైతులకు సరిపడా యూరియా అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు విమర్శించారు. ఇదే విషయమై ఆయన విలేకరులతో పాలకొండలో శనివారం మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వేల రూపాయలు మదుపులు పెట్టి వ్యవసాయం చేస్తున్న రైతులకు సకాలంలో ఎరువులు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. ఎరువుల కోసం ఇండెంట్‌లు పెట్టలేదా అని అధికారులను నిలదీశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి, యూరియా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సమస్యలపై ఈ నెల 8వ తేదీన చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

రహదారి ఛిద్రం..



ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామమైన కూనేరు ప్రధాన రహదారి ఛిద్రమైంది. రోడ్డు మధ్యలో ఏర్పడిన పెద్దపెద్ద గుంతలతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆ దారిలో వెళ్లాలంటే ఒళ్లు హూనమైపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కూనేరు సంత వద్ద రహదారి పూర్తిగా ధ్వంసమైందని. వాహనాలతో అటువైపుగా వెళ్లాలంటే భయమేస్తోందని, టైర్లు పాడైపోతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రహదారి బాగు చేయాలని కోరుతున్నారు. –కొమరాడ

అందం..ఆహ్లాదం!



ఏజెన్సీ పొలాల్లోని పచ్చని పైరు కనువిందు చేస్తోంది. కనుచూపు మేర వరి సాగుతో అందం, ఆహ్లాదం నెలకొంది. గుమ్మలక్ష్మీపురం మండలం, చాపరాయి–జిన్నిడి గ్రామ కొండపరిసరాల్లో నేలతల్లికి పచ్చని పట్టుచీర కట్టినట్లు కనిపిస్తున్న సుందర దృశ్యాన్ని ఈ చిత్రంలో చూడొచ్చు. –గుమ్మలక్ష్మీపురం

సచివాలయ ఉద్యోగుల ఆందోళన



సచివాలయ ఉద్యోగులకు క్లస్టర్ బాధ్యతలు అప్పగించడంపై వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకొండ నగరపంచాయతీ కార్యాలయం ముందు వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి శనివారం విధులకు హాజరై నిరసన తెలిపారు. తమకు అదనపు పని ఎక్కువ కావడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమను క్లస్టర్ పనుల నుంచి దూరం చేయాలని కోరారు. అనంతరం కమిషనర్ రత్నంరాజుకు వినతిపత్రం అందజేశారు. –పాలకొండ

మలుపు..ప్రమాదానికి పిలుపు

పాలకొండ మండలంలోని గోపాలపురం–మంగళాపురంల మధ్య విశాఖ రోడ్డులోని మలుపు అత్యంత ప్రమాదకరంగా కనిపిస్తోంది. మలుపు..దానికి తోడు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కల కారణంగా దగ్గరకు వచ్చినంత వరకు అవతలి వైపు నుంచి ఎవరు వస్తున్నారో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఒక్కోసారి వేగంగా వచ్చే వాహనాలు ఒకదానికొకటి ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని, కనీసం రోడ్డు మీదికి వచ్చేసిన జంగిల్స్‌ను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. –పాలకొండ రూరల్

